# గోడమీద గడియారం



డి. వీరభద్రరావు

"టక్, టక్..టక్, టక్.." అయి, బద్ధంగా శబ్దం చేస్తోంది గోడమీద గడియారం. తెల్లవారు ఝాము మూడు గంటలు దాటినది.

కొడికట్టిన మూనెదీపం ప్రసరింప చేస్తున్న వన్నని కాంతి గదినిండా ఆవరించి వది. వాసు మందస్వరంతో గీతాపారాయణం చేస్తున్నాడు. గది మధ్యలో వెంకట్రామయ్య గారి మంచం, ఆయన మృత్యువుతో తుది పోరాటం సలుపుతున్నారు.

గ్రామ ప్రముఖులతో గది నిండిపోయి వది. అందరి ముఖాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. వెంకటామయ్యగారు మరి కొంత కాలం తమతో మెలగాలన్నదే గ్రామ ప్రజల మనసులలోని కోరిక. అయితే విధికి ఎలాటి వారూ తలవంచవలసినదే. వెంకట్రామయ్య గారు తమ జీవితంలోని అంతిమ ఘడియలలో ప్రవేశించారన్నది విదితమై పోయింది. అప్పటికి కొన్ని గంటలపూర్వమే ఆయన స్పృహ కోల్పోయారు. స్పృహ కోల్పోడానికి ముందు అందరి మొహాలు పరికించి చూశారు. ఏదో అవ్యక్తమైన తృప్తి ఆయన ముఖంలో తొణికిసలాడింది. వాడిపోయిన ఆ ముఖంలో చిరునవ్వు వెలిగింది. గదంతా నిశ్శబ్దం ఆవరించగా ఆయాసంతో కూడిన స్వరంతో ఆయన నోటినుండి యీ మాటలు వెలువడ్డాయి.

"సంతృప్తికరంగా జీవితం సాగించడం ఒక గొప్ప అదృష్టం. ఒకవాడు నేను అలాటి అదృష్టానికి నోచుకోలేదేమోనని అమితంగా భయపడ్డాను. నేను మంచం మీద పడ్డ యీ వారం రోజులూ నా గతజీవితాన్ని సింహావలోకనం చేసుకొని చూశాను. అక్కడక్కడ నా జీవితాన్ని చీకటి మచ్చలు అలుముకొన్నా, మొత్తం మీద ఏ అదృష్టమయితే నాకు దూరమవుతుందని భయపడ్డానో ఆ అదృష్ట దేవత నన్ను వరించడమే కాక నాకు అతి సన్నిహితంగా కూడ మెలగినదని తెలుసుకున్నాను. దానికి ప్రమాణము కుటుంబరహితుడనైనా యీనాడు నేను చూస్తున్న దృశ్యమే. నా జీవితం యింత సంతృప్తికరంగా గడచిపోవడానికి మీలో ప్రతి ఒక్కరు కారకులయారు. మీ అందరకు యివే నా మనఃపూర్వక కృతజ్ఞతలు. ఈ లోకంలో నా బాధ్యతలు తీరిపోయాయని నా అంతరాత్మ చెబుతోంది. మీ అందరి శలవు తీసుకొంటున్నాను."

అటుపిమ్మట వాసు వైపు తిరిగి యిలా అన్నారు:

"నాయనా వాసు, నిన్ను మొదటిసారిగా చూసినప్పుడు కొన్ని భావాలు మెదిలాయి నాలో. నిన్ను నా కోరికల ప్రకారం రూపొందించాలని ఒక బలమైన కాంక్ష నాలో ప్రవేశించింది. కాని ఆకాంక్ష వెనువెంట అలాటి అధికారాన్ని నీపై చలాయించడానికి నేనెవరిని అన్న ప్రశ్న నీడలా నన్ను అనుసరించేది. చివరకు నా అధికారంతో ప్రమేయం లేకుండానే నీవు నా కోరికల ప్రకారం మలచబడ్డావు. అది భగవదనుగ్రహం. నాలో యిప్పుడు ఏ కాంక్షలూ లేవు.

"ఎంతకాలం నుండో నాకు అండగా నిలచి నా జీవిత ప్రవాహాన్ని ఒక నిర్దిష్టమైన మార్గం గుండా ప్రవహింప చేసినది, యిదుగో యీ 'భగవద్గీత'. నేను శాశ్వతంగా కనులు మూసే వరకు గీతాపారాయణం కావించు నాయనా." ప్రక్కనే వడి వున్న భగవద్గీతను తీసి వణికే హస్తాలతో వాసుకు అందించారు.

చివరకు ఆయన చూపులు వాసుపై నిలిచాయి. ఆ చూపులను ఏ విధంగా చదివేది?

వెంకట్రామయ్యగారితో పరిచయమైన క్షణాలు యింకా స్మృతిపథంలో స్పష్టంగా మెదులుతున్నాయి.

ఈ గ్రామానికి నేను వచ్చి అప్పటికి కొన్ని మాసాలు మాత్రమే గడిచాయి. వాసు అయిదేళ్ళవాడు. ప్రాథమిక పాఠశాలకు వెడుతున్న కొత్తరోజులు. కుంటుతూ వడుస్తున్న వాసును ఒకచేత్తో పట్టుకొని మాయింటి వైపు వస్తున్నారాయన. ఆరడుగుల నల్లటి పొడవాటి వ్యక్తి. పొడుగు

ఖద్దరు చొక్కా ఖద్దరు పంచె పైమీద ఖద్దరు కండువా. నలభై సంవత్సరాలు పైబడి వయసు ఉంటుంది. ఆయన పేరు, వ్యక్తిత్వం గురించి చూచాయగా ముందే విన్నాను. నిస్వార్థ జీవి అనీ, యితరుల కోసం బ్రతికే మనిషి అనీ పలువురు చెప్పుకుంటారు.

ఆడుకోడానికి బయటకు వెళ్ళినవాడు చీకటి పడుతున్నా యిల్లు చేరలేదేమా అని తలుపులు తెరచి వుంచి ద్వారం గుండా బయటకు చూస్తున్నాను వాసు కోసం.

వారు యింటి సమీపానికి చేరగానే "రండి, రండి" అని ఆహ్వానించడం తప్ప మరేమి పలకాలో పాలుపోలేదు నాకు. వాసు నన్ను చుట్టేశాడు.

వాల్చి ఉన్న, పడక కుర్చీలో కూర్చుంటూ "మీరూ కూర్చోండమ్మా" అని ఆయన మొదలుపెట్టారు.

"మీ అబ్బాయికి చురుకుపాలు మహా జాస్తి. పసివాడైనప్పటికి వయసుకు మించిన ఓరిమిని కూడా సంపాదించాడు. మాయింటికి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో యీ కుర్రాళ్లంతా చేరి ఆడుకుంటారు. ఆటల అనంతరం రివ్వున పరుగెత్తి పారిపోతుంటారు. ఈ రోజు కూడ అలవాటు ప్రకారమే పరుగు తీయడంలో మీవాడు కాలికి రాయి తగిలి నేలమీద పడిపోయాడు. అదంతా చూస్తున్న నేను లేచి మీవాడి దగ్గరకు త్వరత్వరగా చేరుకున్నాను. అప్పటికే మీవాడు నేలమీద నుండి లేచి బట్టలకు అంటుకున్న దుమ్మును దులుపుకుంటున్నాడు. కాలికి బలంగా గాయం తగిలి రక్తం చిమ్ముతోంది. పెదవులు బిగబట్టి బాధనంతా తనలోనే అణచుకుంటూ మీయింటి వైపు రెండడుగులు వేశాడు. ముందుకు వెడుతున్న వాడిని నేనాపి మాయింటికి తీసుకు వెళ్ళాను. గాయానికి ప్రథమచికిత్స చేసి, మందు వేసి కట్టుకట్టి, యింటివరకు దిగబెడతాను తమ్మని తీసుకువచ్చాను.

"ఇంతకూ చెప్పొచ్చేదేమంటే, మరొక కుర్రాడైతే ఆ దెబ్బకు బావురుమనేవాడు. మంచి శిక్షణ నిస్తున్నావమ్మా" అని జరిగినదంతా చెప్పారు.

పమిటతో చుట్టూ కప్పుకొని నేనూ, ప్రక్క వాసు క్రిందపరచి వున్న చాప మీద కూర్చున్నాం.

"మీ మేలు ఎప్పటికీ మరచిపోలేనండి. మీరు చెప్పింది నిజమే. వీడి కాలు క్షణం నేలమీద నిలవదు. ఎలావేగాలో ఏమిటో వీడితో" అన్నాను.

వాసు కట్టుకట్టి ఉన్న కాలివ్రేలిని, మెల్లిగా కదుపుతూ అటే చూస్తున్నాడు.

"నొప్పి పుడుతోందా వాసూ?" అని అడిగారాయన.

ఏదో దొంగపని చేస్తున్నవాడు దొరికిపోయినట్టుగా మొహం పెట్టి "లేదు" అని సమాధానమిచ్చాడు వాసు.

"అన్నట్టు నన్ను వెంకట్రామయ్య అంటారు. నీపేరు సుశీలమ్మ కదూ. నీవు యీ ఊరి మాధ్యమిక పాఠశాలలో ఉపాధ్యాయినిగా చేరినప్పటి నుండి నీవెవరివో తెలుసును. ఎటొచ్చి స్వయం పరిచయం కలిగే అవకాశం యిదుగో యీవాడు వాసు ద్వారా కలిగింది. ఇక వెళ్ళి వస్తా. మళ్ళీ ఎప్పుడైనా కలుసుకోవచ్చు" అని వెళ్ళిపోయారాయన.

ఆయన వెళ్ళిపోగానే వాసును హృదయానికి హత్తుకున్నాను. నాకళ్ల వెంబడి నీళ్లు జలజలా రాలాయి.

"అదేమిటమ్మా, ఎప్పుడూ ధైర్యంగా, ఉండాలని నువ్వేగా చెప్పావు. ఏడుస్తున్నావా? అన్నాడు వాసు.

"లేదు బాబూ. ఇంకెప్పుడూ యిలా దెబ్బ తగిలించుకోకేం. రక్తం వచ్చిందా? నొప్పి కలుగడం లేదూ?" అనడిగాను.

"లేదమ్మా. నొప్పి బాగా తగ్గిపోయింది. ఏదో చీమ కుడుతున్నట్టుందంతే. ఆయనే బాగా కట్టు కట్టారమ్మా. ఏదో 'లోషన్' నీళ్లట వాటితో శుభ్రంగా రక్తాన్ని వేళ్లకున్న మట్టినీ కడిగివేసి, ఆ తరువాత గుడ్డ వేసి కట్టారమ్మ. అప్పుడు అలాటి పనులన్నీ 'హాస్పిటల్'లో చేస్తారని నీవు చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. అప్పుడాయన్ని

"ఇది హాస్పిటలా?" అనడిగాను.

"కాదు నాయనా. మా యిల్లే" అన్నారు ఆయన.

"మరి హాస్పిటల్ ఎక్కడ వుంది?" అని మళ్ళీ అడిగాను.

'మన ఊరికి హాస్పిటల్ లేదు నాయనా' అన్నారు ఆయన. అలా అంటూంటే ఎందువలనో ఆయన కళ్లలో నీళ్లు తిరిగాయమ్మా. అప్పుడు నేను మళ్ళీ

'మన ఊళ్లో ఎందుకు హాస్పిటల్ లేదూ?' అనడిగాను.

'డాక్టర్లకు యీ ఊరు నచ్చదు నాయనా, అందుకే ఎవరూ రారు' అన్నారు ఆయన. అప్పుడు నేనేమన్నానో తెలుసా అమ్మా?

'అలాగైతే చూస్తూ వుండండి. నేనే పెద్దవాడినై పోయి, డాక్టరునై పోయి యీ వూర్లో హాస్పిటల్ పెడతాను' అన్నాను.

"ఆయన నన్నెత్తుకొని గట్టిగా అదుము కొని 'అలాగే బాబూ' అన్నారు. అప్పుడు నాకేదోలా అనిపించిందమ్మా" అని వాసు తనకు కలిగిన సంఘటననంతా వివరించి చెప్పాడు.

వాసు మాటలు వింటే నాకేదో భయం కలిగింది. "భగవంతుడా! లేనిపోని ఆశలతో వాసును ఆకాశం మీదకు నెట్టివేయకు, నేలమీదే నడువనీయి" అని ప్రార్థించాను.

వాసుకు తల్లినీ, తండ్రినీ నేనే. ఉపాధ్యాయినిని అయిన నేను, ఏవో ఆదర్శలోకాలకు పోయి, ముందు కుమారునికి సమగ్రమైన శిక్షణ నివ్వాలన్న ఉన్నతమైన ఆలోచనలతో వాసును వాస్తవ పరిస్థితుల నుండి దూరంగా తరిమి వేస్తున్నానేమో అన్న భయం కలిగింది.

మరొకరోజు ఆటలకు వెళ్ళి తిరిగి వస్తున్న వాసుతో పాటు వెంకట్రామయ్యగారు కూడ వచ్చారు. ఆయన మరల అలా రావడం ఏదో 'సంకటు'మనిపించింది నాకు. ఇది అసలే పల్లెటూరు. నేనా తలచెడిన ఒంటరి ఆడదాన్ని. లోకానికి ఝడిసి, అణగి మణగి ఉండడం అవసరమని నాలోని ఏవో మారుమూల అణువులు సలహా చెబుతూన్న పరిస్థితిలో ఉన్నదానిని.

లోన ప్రవేశించి పడకకుర్చీలో కూర్చున్నారు వెంకట్రామయ్యగారు. వాసు, నేను చాప మీద కూర్చున్నాం.

"నాకు కృతజ్ఞతను తెలుపమని వాసుకు నీవేమైనా చెప్పి పంపావా?" అని నన్నడిగారు ఆయన.

విషయమేమిటో తెలియక నవ్వి మౌనం వహించాను నేను.

"మీ వాడికి గాయం పూర్తిగ మానిపోయిందట. అందుకని నా దగ్గరకు వచ్చి కృతజ్ఞత చెప్పుకుంటున్నాడు. గాయం తగిలిన వెనువెంటనే నేనా విధంగా చికిత్స చేయడం వలనే అంతత్వరగా నయమయిందట. నేను కనక ఆ విధంగా చేయకపోతే తను యింటికి చేరేలోగా ఆ గాయం నిండా మన్ను చేరి, పుండు అయేదట. ఇంకా కొన్ని పరిస్థితులలో

ఆ వ్రేలు తీసివేయవలసిన ప్రమాదం కూడ జరిగేదట. నేను అలాటి ప్రమాదాల నుండి తనను తప్పించినందుకు నాకు ఏనాటికైనా నేరే ప్రత్యుపకారం చేసి ఋణం తీర్చుకుంటాడట.''

వాసు గురించి ఆయన అలా చెప్తుంటే వింటుంటే నాతనువు పులకరించింది. నేనిస్తున్న శిక్షణ తాలూకు ఫలాలు కనిపించడం ప్రారంభించాయి. పిచ్చి వెధవాయి! ఆ గాయం తగిలిన రోజున ''గాయానికి కట్టుకట్టక పోతేనేం? ఏం జరుగుతుంది?'' అని ప్రశ్నలు వేసి సమాధాన పరిచేవరకు నిద్రపోలేదు. ఆయన యింకా చెప్పుకుపోతున్నారు.

''మీవాడికి కుతూహలం చాలా అధికమమ్మా. పట్టుదల కూడ అధికంగానే ఉన్నట్టు కనిపిస్తోంది. ఈ ఊర్లో హాస్పిటల్ లేదని పెద్దవాడయిన తరువాత డాక్టరైపోవాలని యిప్పటికే తీర్మానించుకున్నాడు. అంతవరకు ''యిలాటి చిన్న చికిత్సలు చేయడం ఊర్లో ఉన్నవాళ్ళంతా ఎందుకు నేర్చుకో కూడదూ?'' అని ప్రతిపాదించాడు. 'నేను ముందు నేర్చుకొని మిగతా వాళ్ళందరకు నేర్పిస్తానుండండి' అంటూ కట్టుకట్టే విధానం ఓపిగ్గా నేర్చుకున్నాడు. పూవు పుట్టగనే పరిమళిల్లుతుందంటారు. మీవాడు మంచి అభివృద్ధిలోకి వస్తాడు.

''నేను ముఖ్యంగా యీరోజు యిక్కడకు రావడానికి కారణం నీకొక సలహా చెప్పిపోదామని. కొన్ని కొన్ని పరిస్థితులు కొన్ని కొన్ని పరిణామాలకు దారితీస్తాయి. ఇవుడు మీవాడికున్నది పొంగే ఉత్సాహం. ఏ పరిస్థితులలోనూ కూడ ఆ ఉత్సాహంపై నీళ్ళు చల్లి దానిని చల్లార్చడానికి యత్నం చేయకు. ఏ సమయంలోనైనా సలహాలకు, సహాయానికి వెంకట్రామయ్య ఉన్నాడని జ్ఞప్తిలో ఉంచుకో, నేను వెళ్ళివస్తా.''

ఆయన పలుకులు మంత్రాక్షతలలా పనిచేశాయి నామీద. మనసును ఆవరించిన అనుమానపు తెరలేవో విడిపడుతున్న అనుభూతి కలిగింది. ఆయన దృష్టిపథంలో ఉన్నంతవరకు ద్వారం వద్ద అలానే నిలబడిపోయాను.

ఒకరోజు వాసు పలక మీద దేవనాగరి అక్షరాలు దిద్దుతున్నాడు. ఆశ్చర్యపోయాను. అంత చిన్న తరగతులలో దేవనాగరి లిపి ఎక్కడా నేర్పరే!

''అవేమిటి బాబూ దిద్దుతున్నావు?'' అనడిగాను.

''సంస్కృతం అక్షరాలమ్మా''

''సంస్కృతం కూడ నేర్పుతున్నారా మీ క్లాసుకు?''

''స్కూల్లో కాదమ్మా. ఆయనే నేర్పుతున్నారు. మొన్నొక రోజున ఆయనేదో పద్యంలా చదువుతున్నారు. అదేమిటో అర్థం చేసుకోవాలని ఎంత ప్రయత్నించినా ఒక ముక్క బోధపడలేదు. ఆయన పఠించడం ఆపిన తరువాత అడిగాను ఏమి చదువుతున్నారని. 'శ్లోకాలు' అన్నారు ఆయన. అయినా నాకర్థం అవలేదు. 'అంటే?' అన్నాను. అప్పుడాయన నాకు తెలియలేదని పసిగట్టారో ఏమో, 'యిది సంస్కృత భాష' అని దాని గొప్పతనాన్నంతా చెప్పారు. నువ్వు దానిని గురించి నాకసలు ఎప్పుడూ చెప్పలేదేమమ్మా? అప్పుడు నా మనసులో నీకు రాదులాగుంది, అందుకే చెప్పలేదనుకున్నాను. ఆయన్నే నేర్పమని అడిగాను.

''ఆయనకు చాలా సంగతులు తెలుసమ్మా. నీకెన్ని వచ్చో ఆయనకు కూడ అన్నీ వచ్చు. నీకు తెలియని కొత్త విషయాలు ఆయనకు వచ్చు. ఇప్పుడు నేను ఎక్కువ సేపు ఆడుకోడం లేదమ్మా. కొంత సేపు ఆడుకొని మిగతా సమయం ఆయన దగ్గరే గడుపుతున్నాను. ఆయనకు నేనంటే చాల సరదా అమ్మా. ఆయన నాతో బోలెడు కబుర్లు చెప్పి, నాతో బోలెడు చెప్పించుకొని నవ్వుతూ ఉంటారు.''

నేను పరధ్యానంలో పడ్డాను. ఇవన్నీ ఏ పరిణామానికి దారితీస్తాయో అగమ్యంగా ఉంది. వెంకట్రామయ్యగారు వాసుకు గురుత్వం వహించడం ప్రారంభించారు. పితృప్రేమ తెలియని జీవితం వాసుది. భగవంతుడే ఆవిధంగా ఆ ప్రేమను వాసుకు ప్రసాదిస్తున్నాడా? అప్రయత్నంగా నా కనులు చెమర్చాయి.

''ఆయన దగ్గరకు వెళ్ళడం తప్పా అమ్మా?'' అన్న వాసు ప్రశ్నతో యీ లోకంలో పడ్డాను.

''అబ్బే, లేదు బాబూ. తప్పకుండా, వెళ్ళు'' అన్నాను, ఆయన సలహాను గుర్తు తెచ్చుకుంటూ.

ఒకదాని వెంట ఒకటి సంవత్సరాలు కాలగర్భంలో కలిసిపోసాగాయి. కాలగమనంతోపాటు మా జీవితాలు కూడ యీ గ్రామంతో పెనవేసుకుపోయాయి. దినదినానికి ఈ గ్రామం పట్ల ఆప్యాయత పెరుగసాగింది. ఇక్కడి ప్రజలలో వెల్లివిరుస్తున్న సహృదయత, సౌజన్యత, సౌశీల్యము అవగాహన చేసుకొన్నాను. ఆశ్చర్యపోయాను. ఈ గ్రామం ఒక విచిత్రం అనిపించింది. స్వప్నంలో ఉన్నానా, లేక వాస్తవ జగత్తులోనిదేనా యీ గ్రామం అన్న సంశయం కలిగింది. ఆవేశాలకు, కావేషాలకు తావు లేదు యీ గ్రామంలో. రావణాసురిడి కాష్టంలా తగలడే విరోధాలసలే లేవు. ఒకత్రాటి మీద నడవడం, ఒక మాట ననుసరించడం సునాయాసంగా అలవడ్డాయి గ్రామప్రజలకు. 'ఈ ప్రగతికంతకు వెనుకనున్న వ్యక్తి ఒకే ఒకడు. ఆయన వెంకట్రామయ్యగారు'— అన్న భావం యిక్కడి ప్రజలందరి హృదయాలలోను, నిత్యం వెలుగొందుతుంది.

ఒకప్పుడు యీ గ్రామంలోనూ కయ్యాలూ, కావేషాలూ కాపురం చేశాయి. మునసబు జట్టూ, కరణం జట్టూ అనుక్షణం ఢీకొనేవి. తాము మునసబు వర్గంలోని వారో, లేక కరణం వర్గంలోని వారో నిర్ణయించుకోలేక ఏమయితే ఏ ప్రమాదం వాటిల్లుతుందోనని నిత్యం భయకంపితులయేవారు ప్రజలు. త్యాగానికి తర్కాన్ని చమత్కారాన్ని జోడించి ఆ వైషమ్యాలను వెంకట్రామయ్యగారు ఏవిధంగా అంతరింపచేశారో కథలలా వినవచ్చాయి.

ఈ గ్రామంలో మునసబు వర్గానికి కరణం వర్గానికి విరోధం తారస్థాయినందుకొన్నది యీ గ్రామంలో శివాలయం కట్టించాలా, రామాలయం కట్టించాలా అన్న ప్రశ్న ఉదయించినపుడు. భగవంతుని ఆలయం పేరిట చందాలు సేకరించడం అప్పటికే జరిగిపోయింది. అయితే ఏ దేవుని పేరిట ఆలయం కట్టించేది ప్రజలు అడుగనూ లేదు, చందాలు వసూలు చేసిన గ్రామాధికారులు చెప్పనూ లేదు. చందాలు వసూలు చేసేటపుడు కరణం మునసబులు ఐక్యతతోనే వ్యవహరించారు. ఆ తరువాత ఉత్పన్నమయింది ఏ దేవునికి మందిరం కట్టించాలన్న విషయం.

ప్రజలంతా తబ్బిబ్బయ్యారు. ఆ ప్రశ్న ఉత్పన్నమయిన తరువాత గాని దాని ప్రాముఖ్యత విశదమవలేదు. మునసబు కరణాలు కావాలనే ఆ విషయం దాచిపెట్టారని ప్రజలు గ్రహించారు. రహస్యం ఏమంటే మునసబు శివభక్తుడు. కరణం విష్ణు భక్తుడు. ఈ గ్రామంలో మునసబు అధికుడో, కరణం అధికుడో కట్టబోయే దేవాలయం చాటుతుంది. 'శివుడు గొప్పవాడ'ని మునసబు వర్గం వారంటే, 'కాదు, విష్ణువే గొప్పవాడు. ఆ విష్ణువు ఎత్తిన దశావతారాలలో రాముడు అఖిల జనానికి ప్రియుడయ్యాడు కాబట్టి, రామాలయమే వెలియాలి' అని కరణం వర్గంలోని వారన్నారు. ఇరువురిలో ఎవరూ తమ ఓటమిని అంగీకరించలేదు. చివరకు ప్రజాభిప్రాయం సేకరిద్దామన్నారు. ఆవిధంగా మునసబు కరణం మధ్య ఉన్న వైషమ్యం గ్రామ ప్రజలలోకి దూకింది.

ప్రచారం హెూరాహెూరిగా సాగనారంభించింది. ఒక దేవునికి ఆలయం కట్టించి మరొక దేవునికి మానివేయడం ఒక్కొక్క కుటుంబంలో తరతరాలుగా పాతుకుపోయిన ఒక నమ్మకాన్ని ప్రశ్నించడం వంటిది. తత్కారణంగా ప్రజలావేశపూరితులవడానికి ఎక్కువకాలం పట్టలేదు. గ్రామమంతా రెండుగా శాశ్వతంగా వైషమ్యాలు నిలిచిపోయే ప్రమాదం ఆసన్నమయింది. అలాటి తరుణంలో వెంకట్రామయ్యగారు రంగంలో ప్రవేశించారు. కాబోయే ప్రమాదాన్ని పసిగట్టారు. భవిష్యత్తులో ఎలాటి అనర్థాలు జరుగగలవో ఊహించారు. సమయం మించకుండానే ప్రజలలో ఒక నూతన చైతన్యం తీసుకురావాలని ఆయన అంతరాత్మ ఘోషించింది. గ్రామం తిరోగమంలేని ప్రగతి పథాన నడవాలంటే సంకుచిత మనస్తత్వానికి తావులేకుండ పోవాలి.

ఆయన దృక్పథం అతివిశాలమైనది. ఆయన దృష్టిలో దేవుడు ఒక్కడే. ప్రజలలో నైతిక విలువలకు ఒక శాశ్వత స్థానం ఏర్పరచడం నిమిత్తం పురాణాలు సృష్టించబడ్డాయి. స్వప్రయోజనాపరులైన కొందరు ఆ పరమ పవిత్ర గాథలను తమ స్వార్థానికి ఉపయోగించుకొని వర్గ వైషమ్యాలు తల ఎత్తేటట్టు చేశారు. వేలాది సంవత్సరముల నుండి మహావృక్షంలా పాతుకున్న ఆ భావాలను పెళ్లగించడానికి కొందరు యుగపురుషులు అవసరం. తాత్కాలికంగా ఆ సమస్య పరిష్కారం కావడానికి ఒకే ఒక మార్గం కనిపించిందాయనకు, అది ఒక దేవాలయానికి బదులు రెండు దేవాలయాలు నిర్మింపబడడం. కాని వసూలయిన మొత్తం ఒక దేవాలయ నిర్మాణానికి కూడపూర్తిగ సరిపోదు.

ఆయన శివభక్తుల వద్దకుల వెళ్ళి యిలా అడిగారు.

మీరు ఏ కారణంగా శివుని ఆరాధించడం జరుగుతుందో నేను చెబుతాను. అభ్యంతరం ఉంటే చెప్పండి. మీ కుటుంబంలో ఏనాటి పూర్వీకులో శివుని ఆరాధించడం మొదలెట్టారు. అది తరతరాలుగా కుటుంబాచారంగా నిలచిపోయింది. ఈ ఒక్క కారణం తప్పిస్తే మీరు శివుణ్ణి పూజించడానికి మరే కారణం కనిపించదు. మీరు శివార్చకుల కుటుంబంలో జన్మించడానికి బదులు విష్ణువును పూజించే కుటుంబంలో జన్మించారనుకోండి. అపుడు మీరు కూడ విష్ణువునే ఆరాధించడం జరిగేది. కాదంటారా?"

అదేవిధంగా రామాలయం కావాలనే వారి వద్దకూ వెళ్ళి అడిగారు. ఇరుపక్షాల నుండి మౌనమే వచ్చింది. ఆ తరువాత మునసబు కరణాల వద్దకు వెళ్ళి మంతనాలు జరిపారు. అయితే మునసబు కరణాల వద్ద ఆయన ఉపయోగించినది చమత్కారం.

"ఈ ఊరికి ఒక శివాలయం అవసరం కదు మునసబుగారూ" అనడిగారు వెంకట్రామయ్యగారు మునసబును.


"అదేకదండి నేను పదేపదే చెబుతున్నది."

అన్నాడు మునసబు.

"ఈ ఊరి ధనవంతులలో మీ స్థానం ఎన్నవదో మిమ్ముల నడగడం మిమ్ములవమానించినట్లే అవుతుంది. శివాలయమే నిర్మింపబడేటట్లయితే మీ వంతు మీరెంత యివ్వగలరు?"

"ఓ, అదా? ఆ సంగతి నేను ముందే యోచించాను. నిజానికి ప్రజల వద్దనుండి వసూలయినది అతిస్వల్పం. అంతా చేసి పది వేలు. దానితో దేవాలయం తయారవడం అసంభవం. మీ దగ్గర దాచడమెందుకు, శివాలయానికైతే నా వాటా పదివేలు యిద్దామనుకుంటున్నాను."

"బేష్! మీ పేరు చిరస్థాయిగా వుండిపోతుంది గ్రామంలో, శివాలయానికి నేనూ ఓ యిరవై వేలిద్దామనుకుంటున్నాను. ఒక



వరకు మీద..." అని ఆగారు వెంకట్రామయ్యగారు.

నోట మాటరాక వెంకట్రామయ్య గారి వైపు చూశాడు మునసబు. తేరుకొని,

"ఎంత మాట. చెప్పండి, చెప్పండి" అన్నాడు.

"ప్రజల దగ్గర నుండి వసూలయిన పదివేలతోను ఒక చిన్న శివాలయం కట్టిద్దాం."

"ఓ, దానిదేముందండీ. రాముడంటే నాకు శత్రువన్నావా? ధనలోపం కారణంగా ఏదో ఒకటుంటేనే పిలుపడుతుందని ఆలా పట్టు పట్టాగాని" అన్నాడు మునసబు.

"అయితే రెండు దేవాలయాలు నిర్మించడానికి అభ్యంతరం లేనట్టేగా?"

"మీరు నాకలాటి అభ్యంతరం ఉందనుకొంటే నన్ను తప్పర్థం చేసుకున్నట్టే. అంత సంకుచితంగా వ్యవహరిస్తే ప్రజలు ఎప్పుడో నన్ను శత్రువుగా పరిగణించేవారు." అని నవ్వేశాడు మునసబు లౌక్యంగా మాటాడానని మురిసిపోతూ.

వైభవంగానే కరణంతో కూడ సంభాషణలు జరిపారు వెంకట్రామయ్యగారు. ఫలితాలు కూడ వైభవంగానే కలిగాయి. రామాలయానికైతే కరణం పడికట్టిస్తున్నాడు. వెంకట్రామయ్యగారు మరొక యిరవై వేలిస్తామన్నారు—ప్రజల వద్ద నుండి వసూలైన సొమ్ము శివాలయానికి ఖర్చు పెట్టడానికి కరణానికి అంగీకారమయితే.

ఆ విధంగా శివాలయమూ, రామాలయమూ కూడ వెలిశాయి యీ గ్రామంలో. వెంకట్రామయ్యగారి త్యాగానికి, లౌక్యానికి మునసబు కరణాలిద్దరూ సిగ్గుపడిపోయారు. ఆనాటితో యీ గ్రామంలో కలతలు అంతరించాయనే చెప్పొచ్చు.

వెంకట్రామయ్యగారు గ్రామానికి చేసిన సేవలైతే పలువురి నోళ్లలోనూ ఆడుతున్నాయి గాని ఆయన అంతరంగిక జీవితం గురించి స్పష్టంగా ఎవరూ చెప్పలేక పోయారు. ఆ విషయంలో నాకు తెలిసింది— ఆయన చిన్న వయసులోనే ఆయన భార్య స్వర్గస్థురాలయినదనీ, ఆ అనంతరం ఎప్పటికీ మానవిదయినదనీ, ఆయన గృహస్థుగా గడిపితే చూడాలని గ్రామ ప్రజలంతా ఉవ్విళ్ళూరుతున్నారనీను. ఏదేమైనా ఆయన, హృదయాన్ని చూసాక ఆయన సతీమణి ఎంత అదృష్టవంతురాలో అనుకున్నాను.

# గోడమీద గడియారం

నాకు కారణంగా వెంకట్రామయ్యగారికి నాకు మధ్య సన్నిహితత్వం ఎక్కువయింది. తరచుగా ఆయన మాయింటికి రావడము, నేను ఆయన యింటికి వెళ్ళడము జరుగుతూండేవి. ఆయన విజ్ఞాన ఖని, ధనార్జన దృష్టితోకాక కేవలం స్వయం తృప్తికై ఆర్జించిన విజ్ఞానం ఆయనది. అందుకే ఆ విజ్ఞాన కిరణాలతో యీ గ్రామం యింతగా వెలుగొందుతోంది. నాసుతో పాటు ఎన్నో పాఠాలు నేనూ నేర్చుకున్నాను.

వెంకట్రామయ్యగారు—నాసు, వారిద్దరిని ఎన్నడైనా చూసినా, మనసులో మొదలివా రాను రాను ఒకే ఒకభావం నిలచిపోసాగింది. అది గురుశిష్యుల సంబంధం కంటె అధికమైనది. అది తండ్రీ కుమారుల అనుబంధం. వెంకట్రామయ్యగారిని నాను తండ్రి స్థానంలో చూడసాగాను. అస్థానంలో ఆయన నాకు కేవలం పూజనీయులు. అంతే. అంతకుమించి ఆలోచనలను పోనియడానికి భయపడ్డాను. అయితే, అంతకు మించి ముందుకు పోగడానికి లోకం వెరుప లేదు!

పండుటాకులా వణికిపోయాను ఆ పలుకులు విని.

"వెంకట్రామయ్యగారి జీవితంలో వసంతం తేవడానికి నీవు సహాయ పడగలవు" అన్నవి ఆ పలుకులు.

నాతో పనిచేసే ఒక సహ ఉపాధ్యాయినివి ఆ పలుకులు.

"ఇలా అంటున్నందుకు అపార్థం చేసుకోకు నన్ను. మరేవో అర్థాలు కూడ ఊహించుకోకు. చాటునొక మాట అనుకొని బయటకు మరొక మాట అనే తత్వం యిక్కడి ప్రజలకు లేదు. పోతే నాకున్న అభిప్రాయం యిక్కడి ప్రజలనేకులకు ఉంది" అన్నది మళ్ళీ ఆమె.

అప్పటికే నాముఖం వివర్ణమయింది. అపార్థం చేసుకోవలసిన అవసరం యీ గ్రామ ప్రజలతో జీవించే వారెవరికీ కలుగదు. కాని ఆయన పట్ల నాకుపూజ్యభావం తప్ప మరేమీ లేదు. పైగా..పైగా..

"క్షమించు.. అందుకు నాకు అర్హత లేదు." అన్నాను. అదే నా అభిప్రాయం కూడాను. ఆమె వెళ్ళిపోయింది. మనసు నా గత చరిత్ర పుటలలోనికి మళ్ళింది.

"వెంకట్రామయ్యగారి జీవితంలో వసంతం తేవటం అనే అవకాశం లభించడం ఏ స్త్రీకైనా ఒక వరం లాంటిది. అయితే నేనొక అనామక స్త్రీని, ఒక అనామక పురుషునికి భార్యగా కొంతకాలం జీవించినదానిని. నాకలాటి వరం లభించే అర్హత లేదు.

చుట్టూ ఉన్న ప్రపంచాన్ని గ్రహించే వయసు రాగానే నేనొక అనాథ శరణాలయంలో పెరుగుతున్నట్టు గ్రహించాను. మమతలు తెలియని బ్రతుకు అది. ప్రపంచానికి అవసరంలేని వస్తువులను వేటినో పోనీగదా అని ఒకచోట కూర్చినట్టు భావించే వారు అనాథ శరణాలయం అధికారులు. ఆ వస్తువుల అస్తిత్వం ఏ రీతిగ ఉన్నా వారికి అనవసరం. ఆ వస్తువులు మరొక స్థితిలో నుంటేపూర్తిగా వినాశం చెందేవని, ఆ వినాశం నుండి కాపాడారు కాబట్టి అంతకంటె చెయ్యవలసిన దేముందని వారి ఉద్దేశం. ఆ పరిస్థితులలో పెరిగే వారిలో చాలమంది అపరిపక్వంగానే ఉండిపోయేవారు. వ్యక్తిత్వం, హృదయం, అనుభూతులు యిలాటి వేవీ వారిని అంటేవి కావు. అలాటివి అంటడం శరణాలయాధికారుల అభిమతం కూడ కాదు. అవి లేనిపోని సమస్యలకు దారితీస్తాయని, అప్పటికే వారు ఒలకబోస్తున్న సహృదయత అపరిమితమైనదని వారి అభిప్రాయం. అయినప్పటికీ వారికి సమస్యలను రేకెత్తించడానికి నాలాటివారు అడపాతడపా తగులుతూనే ఉండేవారు. నాతోపాటు మరో యిద్దరు అమ్మాయిలు కూడ ఉండేవారు. మా ఆలోచనలెప్పుడూ ప్రస్తుతానికి మరో రెండడుగులు ముందు ఉండేవి. మాలాటి వారు ఒకరిద్దరుండడం అధికారులకూ యిష్టమే, ఫలానా శరణాలయం పిల్లలు మంచి మార్కులతో చదువులు చదువుతున్నారంటేను, వక్తృత్వపు పోటీలలో గెలుస్తున్నారంటేను, లలితకళలలో ఉత్సాహం చూపిస్తున్నారంటేను దానివలన వచ్చే కీర్తి ఆ అధికారులకే దక్కుతుంది.. అయితే మేము మిగిలిన పిల్లలను చెడిపివేస్తామేమో? నని అధికారుల భయం.

ముఖ్యంగా పదునాలుగు, పదిహేను సంవత్సరాల వయసు వచ్చిన పిల్లలందరకూ "తమ భవిష్యత్తేమిటి?" అన్న ప్రశ్న ఎదురయేది. స్వతహాగా ఆలోచించుకోడానికి




ఒకరి శిరోజ సౌందర్యంచూచి
మరొకరు ఇక ఎంతమాత్రం
అసూయపడవలసిన అవసరం
లేదు. రీటా వాడి మీ కురుల
సౌభాగ్యాన్ని వృద్ధి చేసుకోండి.




విలో కంపెని, మద్రాసు 1
R-22 TG




పండిత
డి. గోపాలాచార్యులవారి
శ్రీ బ్రహ్మామృతం
ఆరోగ్యానికి బలానికి
ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్) లిమిటెడ్
మదరాసు-17

# గోడమీద గడియారం

శక్తిలేని చాలమంది ఆ విషయంలో సలహా తీసుకోడానికి నాలాటి వాళ్ల చుట్టూ గుమి గూడేవారు. నాకు సాహిత్యం అంటే అభిరుచి ఎక్కువగా ఉండేది సాహిత్య పఠనంతోపాటు స్వప్నప్రపంచంలో విహరించడమూ అలవ డింది. అందువలన నా ఆలోచనలెప్పుడూ ఆకాశంలోనే ఉండేవి.

"మిమ్మల్నందర్నీ ఒక్కో అందాల రాజ కుమారుడొచ్చి పట్టుకుపోతారు లెండర్రా, భయమెందుకు?" అనేదానిని.

నేను స్కూల్ఫైనలు వరకు చదివి, ఆతరువాత మధ్యమ తరగతులకు ఉపాధ్యా యినిగా ట్రైనింగ్ అయ్యాను. నేను ఉద్యోగంచేసి శరణాలయానికి సహాయ పడాలని అధికారుల అభిప్రాయం. నాకూ పెద్ద అభ్యంతరం ఏమీ లేకపోయింది. కాని విధాత మరోకలా చూశాడు.

ఆరోజు మేమంతా తోట పనిలో మునిగి ఉన్నాం. టక్ టక్ మని బూటుల చప్పుడు చేసుకుంటూ చక్కని దుస్తులలో ఉన్న ఒక యువకుడు శరణాలయం ఆఫీసు గదిలో ప్రవేశించాడు. మా అందరి దష్టి అటే మళ్లింది.

"ఈ సుందర రాజకుమారుడు ఎవరి కోసమొచ్చాడేవ్?" అనుకొని "నీ కోస మంటే, నీ కోసమని" పరిహసించుకున్నాం.

ఒక అరగంట గడచిన పిమ్మట ఆ యువ కుడు బయటకు వచ్చి తోటపని చేస్తున్న మమ్మల్నిందర్నీ పరికించి చూశాడు. క్రీగంట మేమూ చూశాము. అందరి కళ్లకు నవ మన్మథుడిలానే కనిపించాడతడు. ఎవరి రొట్టె విరిగి నేతిలో పడుతుందోనని అందరకు ఆశగానే ఉంది.

ఆయువకుడు లోనికి వెళ్లడం, నాకోసం పిలుపు రావడం ఒకేసారి జరిగాయి. నిజమే, ఆ యువకుడు తన ప్రేయసి నెన్నుకోడానికే వచ్చాడు. అతనికి నేను నచ్చాను. శరణాల యాధికారులు అతిగర్వంగా చెప్పుకున్నారు.

"శరణాలయం చరిత్రలోనే యిలాటి అదష్టపు ఘడియలు అరుదుగా కలుగు తుంటాయి. మాతోపాటు యీ అదష్టాన్ని పంచుకొన్న నీకు మా అభినందనలు. శరణాల యాన్ని మరచిపోకు."

నా కలలు పండాయన్న అనుభూతి ఆక్షణంలో నాకూ కలిగింది.

మా వివాహం అనంతరం ఆయన పట్నంలో కాపురం పెట్టారు, రోజులు క్షణాల్లా దొర్లిపోసాగాయి. షికార్లకీ సినిమాలకు కొదువ ఉండేదికాదు. ఏమి నా అదష్టం అని మురిసిపోయే దానిని.

రోజులు వత్సరాలయాయి. ఒకటికీ రెండు, మూడు—మూడు సంవత్సరాల వివాహపు జీవితం గడిపిన తరువాత ఏదో వెలితి కనిపించింది. నా భర్త జీవితంలో ఏదో రహస్యం యిమిడి ఉన్నట్టు గ్రహిం చాను. ఆయన తన అంతరంగిక విషయాలు ఏనాడూ నాతో చర్చించలేదు! ఉండబట్టలేక నేనే అడిగేశాను ఒకనాడు.

"ఏమండీ, నాకు అత్త, మామ, ఆడ పడుచులు, మరదులు ఎవరూ లేరా? ఇంత వరకు ఎన్నడు ఆ విషయాలు నాకు చెప్ప లేదు."

ఎందుకో ఆయన ఉగ్రుడైపోయాడు.

"వ్యవహారం చాలవరకు వచ్చిందే ?" అన్నాడు.

ఆ వాక్యానికి అర్థం నాకు తెలియలేదు. నేను ఆయన దగ్గర ఏమీ వ్యక్తిత్వంలేని మనిషినా? కేవలం దాసినా? అన్న ప్రశ్నలు ఉదయించాయి. అదే ఆయన ఉద్దేశమని తరువాత రోజులు నిరూపించాయి. ఆయన రహస్యాన్ని కనిపెట్టడానికి నేను చేసిన యత్నాలన్నీ విఫలమే అయ్యాయి.

అతడు నైతికంగా అతిబలహీన స్థితిలో ఉన్నట్టు గ్రహించడానికి మరెంతో కాలం పట్టలేదు. మా వివాహమైన కొత్తలో ఉన్న బురఖా తొలగిపోయింది. నన్ను అతి హీనంగా చూడ నారంభించాడు.

నాను కడుపులోపడిన ప్రథమ మాసాలవి.

ఎవరో స్నేహితుడంటూ ఒక వ్యక్తిని తీసుకువచ్చాడు నా భర్త. "ఇప్పుడే బజా రుకు వెళ్లి వస్తా"నంటూ ఆ 'స్నేహితుడి'ని యింటి వద్దనే విడిచి వెళ్లిపోయాడు. ఆ 'స్నేహితుడు' తిన్నగా పడక గదిలోకి దారితీసాడు. అతని ప్రవర్తన విచిత్రమే అనిపించినా 'పాపం అలసిపోయాడు లాగుం ద'ని సరిపెట్టుకొని వంటగదిలో నా పనిలో నేను మునిగిపోయాను. కొన్ని క్షణాల అనం తరం ఆ 'స్నేహితుడు' విసురుగా వంట గదిలో ప్రవేశించి నా భుజాలు పట్టి కుదు పుతూ—

"ఏమిటీ ఆలస్యం?" అని ఘర్జించాడు.

కొయ్యబారిపోయాను! విషయం అవ గాహనమయింది. చెంప పెట్టుతో గాని ఆ 'స్నేహితుడు' యిల్లు విడిచి పోలేదు.

"అనాథ శరణాలయంలో పెరిగిన దానివి ఎలా బ్రతికేవేం?" అంటాడు నా భర్త

నా కలలలోని అందాల రాజకుమారుడతో ఎంత అమానుషం! నాలోని అభిమానం పడగవిప్పి బుస్సుమంది. నైతిక విలువలు కోల్పోయిన వ్యక్తి అతడొక పురుగు కంటె హీనంగా కనిపించసాగాడు.

ఉదర పోషణార్థం నాలుగిళ్లలో 'ప్రైవేటు' కుదుర్చుకున్నాను.

నాకు నాలుగు సంవత్సరాలు నిండిన తరువాత 'అతడు' చనిపోయాడు.

ఈ గ్రామంలోని ఉపాధ్యాయుని జీవితంతో చల్లని వెన్నెలలాటి దినాలు ప్రారంభమయాయి.

* * *

వెంకట్రామయ్యగారి శిక్షణలో నా వ్యక్తిత్వం సర్వతోముఖంగా వికసించింది. చిన్ననాటే బీజం పడగా వెంకట్రామయ్యగారి అండదండలతో 'డాక్టర్' అయ్యాడు.

వెంకట్రామయ్యగారి యిల్లు హాస్పిటల్ కోసం ఏనాడో నిర్ణయమైపోయింది. హాస్పిటల్‌కు కావలసిన పరికరాలన్నీ ఏర్పాటయ్యాయి.

'హౌస్ సర్జన్' ముగించుకొని నాలుగు దినాలలో గ్రామానికి చేరుకుంటున్నట్టు నాసు దగ్గర నుండి ఉత్తరం అందినది. ఆ శుభవార్త నందజేయడానికి వెంకట్రామయ్య గారింటికి బయలుదేరాను. దారి పొడవునా కుడి కన్ను అదరసాగింది. "ఏమిటీ దుశ్శకునం, వెనక్కి మళ్లితే" అనుకున్నాను.

వెంకట్రామయ్య గారింటిని సమీపించాను. వీధి తలుపులు దేరవేసి ఉన్నాయి. అలా ఉండగా నేనెప్పుడూ ఆ యింటిని చూడలేదు. తెరచి ఉన్న ద్వారంతో కలకల లాడుతూ వచ్చేవారలను ఆహ్వానిస్తున్నట్టు ఉండేది ఎల్లప్పుడూ ఆ గృహం. ఇప్పుడేదో క్రొత్త వాతావరణం ఆ యింటిని చుట్టుముట్టి కాంతిహీనం చేసినట్టున్నది.

తలుపులను తోస్తే మెల్లగా లోనికి తెరుచుకున్నాయి.

"టిక్ టిక్...టిక్ టిక్" మంటూన్న గడియారం శబ్దం తప్ప మరే అలికిడి లేదు.

గది మధ్యగా మంచంపై వెంకట్రామయ్యగారు పడుకొని ఉన్నారు. కనులు మూసి ఉన్నాయి. దగ్గరకు వెళ్లి నుదుటి మీద చెయ్యి వేసి చూశాను. వళ్లు సలసల కాగిపోతోంది. పరుగెత్తుకొని ఊళ్లో వాళ్లనందరనూ పిలుచుకు రావాలనిపించింది. నా చేతి స్పర్శకు ఆయన కనులు విప్పి చూశారు.

"వచ్చావామ్మా సుశీలమ్మా! అబ్బాయి, నాసు నాలుగు రోజులలో వస్తున్నాడు కదూ" అన్నారు.

"దాని కేమిగాని ఏమిటి మీకీ పరిస్థితి? ఎన్నాళ్ల నుండి యిలా ఉన్నారు? ఎవరూ దగ్గర లేరే? ఎవరికీ తెలియదా? మందు తీసుకుంటున్నారా?" ప్రశ్న వెంట ప్రశ్న నా నోటి నుండి వెలువడ్డాయి కంఠం రుద్ధమయిపోయింది.

ఆయన మెల్లగా సమాధానం యిచ్చారు "అనేకం తెప్పిస్తాను సుశీలమ్మా. నాకు అంత్యకాలం సమీపించింది. గత కొన్ని దినాలుగా ఏదో పిలుపు వినవస్తోంది. అది యీనాటికి స్పష్టపడింది. అది నా భార్య



సరోజ పిలుపు. ఎన్నో దినాల నుండి ఎదురు చూస్తున్న పిలుపు. మేమిద్దరం త్వరలోనే కలుసుకోబోతున్నాం. మనసు పరవళ్లు తొక్కుతోంది. నీకు కూడ సంతోషంగా లేదూ? నాలుగురోజుల్లో వాసు రాబోతున్నాడు. ఆతరువాత మరి రెండురోజులు

"నీవు, వాసు అనిర్వచనీయమైన ఆహ్లాదాన్ని కలిగించారు నా మనసుకు. నేను మీపట్ల చూపించిన అనురాగంలో స్వార్థముంది సుశీలమ్మా! అది ఎలాంటి స్వార్థమో యీ పుస్తకం చదివితే నీకే తెలుస్తుంది. నా జీవితాన్ని సంక్షిప్తంగా యిందులో పదిలపరచాను. ఈ పుస్తకాన్నియడానికి నీకంటె మరెవ్వరూ ఆప్తులు కనిపించడం లేదు" తలగడ క్రిందనున్న బైండు పుస్తకం తీసి నాకు అందించారు ఆయన.

ఆయన మాటలు ఎలా ఉన్నా ఆయన్ను రక్షించుకోడానికి ప్రయత్నం చేయడం మన విధి. మునసబు కరణాలకు అటునుండే వెళ్లి సంగతి తెలియజేసాను. వారు పరుగు పరుగున వెంకట్రామయ్యగారి సన్నిధికి చేరారు. ఆక్షణం నుండి వెంకట్రామయ్యగారివద్దనే ఆయనకు సేవచేస్తూ గడిపాను.

రోజూ పట్నం నుండి డాక్టరు వచ్చి 'యింజక్షన్లు' మందులు యిచ్చి వెళుతూండేవాడు. అయినా ఆయన స్థితిలో మార్పు రాలేదు.

నాలుగురోజుల తరువాత వాసు వచ్చాడు. వెంకట్రామయ్యగారిని ఆ స్థితిలో చూసి విషణ్ణుడే అయిపోయాడు. ఆయన ప్రక్కనే కూర్చొని ఘడియ ఘడియకు ఆయన స్థితిని పరీక్షించేవాడు.

క్షణక్షణానికి కనుల ముందే ఆయన క్షీణించి పోతున్నట్లయ్యారు. ఆయన విశ్రాంతికై కనులు మూసినపుడు ఆయన నాకు ప్రసాదించిన పుస్తకాన్ని విప్పి ఆయన గత జీవితంలోకి తొంగి చూసేదానిని. అనేక సంవత్సరాలుగా అనుక్షణం కుతూహలం రేపుతూ మనసులో ఖాళీగా ఉండిపోయిన ఆయన జీవితభాగాలు యిప్పటికి నిండాయి. ఆయన ఆర్భాటంగా తన జీవితాన్ని వర్ణించుకోలేదు. అతి క్లుప్తంగా రేఖామాత్రంగా వ్రాసుకున్నారు.

ఆయన జీవితం నుండి వెలుతురు నిష్క్రమించిన క్షణాలు: "సరోజ శాశ్వతంగా కనులు మూసినది. ఇంటిని వెలుతురుతో నింపివేయాలని కోరిక పడ్డది. కాని ఆ వెలుతురు తననే మింగి నానుండి తీసుకుపోయింది. రాబోయే బాబు గురించి తొమ్మిది నెలలు కిలకిలలాడాను. కానుపు కష్టమయింది. కానుపు ప్రారంభమయిన తరువాత ఆపరేషన్‌తో గాని తల్లీ బిడ్డ బ్రతకరని తెలిసినది. ఈ గ్రామంలో హాస్పిటల్ లేదు. పట్నం చేరేలోగానే అపరిమితమయిన బాధకు గురియై అసువులను బాసినది."

ఆయన జీవితంలో వెలుతురు పునః ప్రవేశించిన క్షణాలు: "రాత్రి స్వప్నంలో సరోజ సాక్షాత్కరించినది. పిల్లనగ్రోవిని పెదవుల కానించి మృదు మధుర నాదముతో నన్ను మేల్కొలిపినది. నేను తన దరిచేర పోవడం చూసి నాకు దూరంగా కదల నారంభించినది. గ్రామం మధ్యనున్న ఒక గృహంలో ప్రవేశించినది. నేను తిరిగి వచ్చేశాను. ఆ గృహం నుండి ఆ మధుర నాదం వినవస్తూ అలాగే ఉండిపోయింది. ఈ రోజు ఆ గృహంలో యీవూరి పాఠశాలలో పని చేయడానికి వచ్చిన పంతులమ్మ, ఆమె నాలుగేండ్ల ముద్దుల తనయుడు దిగారు."

చివరి పుటలలో ఆయన తనపై వ్రాసుకున్న వ్యాఖ్యానము: "జీవిత సంధ్యలో అడుగు పెట్టాను. సరోజ పిల్లనగ్రోవి నాదము యిప్పుడు యీ యింటి నుండే వినవస్తోంది. అది సన్నాహ్వానిస్తూ నా కోసం ఎదురు చూస్తున్నట్లు తెలిపే సూచన.

"సరోజ వదలి వెళ్లిన గాఢాంధకారాన్ని సరోజే విచ్ఛిన్నం చేసింది. తన అంశలను కూడి యీ భూమిపై పెరుగుతున్న పేరోకరిని నాసాన్నిధ్యంలోనికి చేర్చినది, సుశీలమ్మలో సరోజ, వాసులో మేము కలలు కన్న బాబు గోచరించారు. వారి సాన్నిధ్యానుభూతి సరోజ పిల్లనగ్రోవి నాదమును పోలింది.

"పోతే సరోజకు దేహాంతము కలిగిన అనంతరం ఏకాకిగా నేను గడిపిన జీవితం కొందరి విమర్శలకు గురి అయింది. అంత త్యాగం చేయవలసిన అవసరం లేదన్నారు.

జీవితం యితరుల కోసం ఉపయోగపడినంతగా నా కోసం ఉపయోగపడటం లేదన్నారు. నిజమే కావచ్చు. వారి విమర్శలు వింటే నాకు గోడమీద గడియారం గుర్తుకు వచ్చింది. ఇన్ని సంవత్సరాలు పడక కుర్చీలో కాలం గడిపిన నాకూ, నాకెదురుగా ఉన్న గోడమీది గడియారానికి పోలికలున్నాయి. నాలాటి వ్యక్తులు యింకా చాలమంది ఉంటారు. వారంతా గోడమీది గడియారం లాటి వారు. వారు యితరుల కోసం మాత్రమే ఉపయోగపడతారు."

వాసు నన్ను తట్టి చెబుతున్నాడు.

"వెంకట్రామయ్యగారు యిక మనకు లేరమ్మా."

గదంతా నిశ్శబ్దం ఆవరించుకొంది. ఎదురుగా చూశాను. గోడమీది గడియారం ఆగిపోయింది. ●

